క్లుప్తంగా

పేద విద్యార్థులకు లయన్స్‌క్లబ్ సాయం



విద్యార్థులకు చెక్కులు ఇస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పాకాల: పలువురు పేద విద్యార్థుల ఉన్నత విద్యకు పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్ సభ్యులు ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కేఎన్.తులసీరామన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేము ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న టి.పవన్‌కుమార్‌కు లయన్ కుప్పుస్వామినాయుడు, పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న జి.చందీప్రియకు రీజినల్ చైర్మన్ లయన్ రామయ్య, వీబీఆర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో డెయిరీ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.యశ్వంత్‌కు డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ ఆర్వీ.ప్రసాద్ ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున చెక్కులను అందజేశారు. ఉన్నత చదువులు అభ్యసించే పేద విద్యార్థులకు తమవంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు దొరస్వామినాయుడు, భాస్కర్‌రెట్టి, భాస్కర, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్‌లు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌లను ప్రారంభిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి తుడా: ఎస్వీ మెడికల్ కళాశాల, మెటర్నరీ ఆసుపత్రిలో సీమాంధ్ర పల్మనాలజిస్టుల అసోసియేషన్ వార్షిక రాష్ట్ర సదస్సు(ఏపీఎస్‌ఏసీఓఎన్ -2025) లో భాగంగా హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్‌లను శుక్రవారం నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష ముఖ్యఅతిథిగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇందులో బ్రోంకోస్కోపీ-లైవ్ కేస్ డెమో, థోరాకోస్కోపి-ప్లూరల్ ప్రొసీజర్స్, అడ్వాన్స్‌డ్ పల్మనరీ ఫంక్షన్స్, స్లీప్ మెడిసిన్, చెస్ట్ రేడియాలజీలో విభాగాలు ఉన్నాయి. కార్యక్రమంలో ఎస్వీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ప్రేమానంద, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సుబ్బానాయుడు, వైద్యులు పాల్గొన్నారు

ఘనంగా ఆదిత్యా బిల్డింగ్ సొల్యూషన్స్ వార్షికోత్సవం



కంపెనీ అధినేత నరేంద్రను అభినందిస్తున్న డాక్టర్ అజయ్‌బాబు

తిరుపతి కల్చరల్: కపిలతీర్థం రోడ్డులో ఉన్న ఆదిత్యా బిల్డింగ్ సొల్యూషన్స్‌లో 10వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆ కంపెనీ అధినేత నరేంద్ర మాట్లాడుతూ, పదేళ్లుగా తమపై నమ్మకం, ఆదరణ చూపిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇళ్ల నిర్మాణంలో ప్రత్యేకంగా మధ్య తరగతి వారికి అనువుగా నాణ్యమైన, మన్నికైన ఇళ్లు నిర్మిస్తూ వారి కలలను సాకారం చేస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా తమ కస్టమర్లకు సేవలందిస్తామన్నారు. పలువురు ప్రముఖ కంపెనీల అధినేతలు నరేంద్రను పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

శాస్త్రోక్తంగా శ్రావణ పౌర్ణమి



భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

రామచంద్రాపురం: శ్రావణ మాసం పౌర్ణమి సందర్భంగా అనుప్పల్లె పంచాయతీ రేకలచేనులోని శ్రీజన్మ స్థల శివాలయంలో పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉద యం ప్రధాన అర్చకులు లక్ష్మీ సహస్ర నామార్చ న, కుంకుమార్చన, పూజార్చలు నిర్వహించా రు. రాత్రి శివాలయ ప్రధాన అర్చకులు అష్టలక్ష్మీదేవి ఆధ్యాత్మిక ప్రవచనం, విశిష్ట పౌర్ణమి పూ జలు చేశారు. మహిళలకు పసుపు, కుంకుమ, రవిక, గాజులు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

దుప్పి పిల్ల మృతి



తిరుమల రెండవ ఘాట్ రోడ్డులో దుప్పి పిల్ల కళేబరం

తిరుమల : తిరుమల రెండవ ఘాట్ రోడ్డు చివరి మలుపు వద్ద రోడ్డుపై దుప్పి పిల్ల మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కొండపై నుంచి జారి పడిందా? ఏదైనా వాహనం ఢీకొని మరణించిందా? అనేది తెలియాల్సి ఉంది. దీనిపై వాహన చోదకులకు అటవీశాఖ అధికారులకు సమాచారం చేరవేశారు.

ఎప్పుడూ యాక్సిడెంట్లే..!

తిరుపతి నుంచి చంద్రగిరి వైపు వెళ్లే రహదారిలో తరచూ ఒకే ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుంటూ మృత్యు మార్గంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. నెల వ్యవధిలోనే పది ప్రమాదాలు సంభవించడం, పలువురు దుర్మరణం చెందడం, మరికొందరు తీవ్ర గాయాల పాలవడం ప్రమాదాల తీవ్రతగా ఈ మార్గం అద్దం పడుతోంది.

- నెల రోజుల్లో పది ప్రమాదాలు
- పలువురు మృతి, మరికొందరికి గాయాలు
- ఆందోళన చెందుతున్న గ్రామస్తులు
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సర్పంచ్ వినతి





పెరుమాళ్లపల్లె వద్ద రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు కింద ఇరుక్కున్న బైకు, రహదారిపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని మండల సమావేశంలో వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ జోగి మోహన్ (ఫైల్)

తిరుపతి రూరల్: మండలంలోని పెరుమాళ్లపల్లె, సి.మల్లవరం, గాంధీపురం, పుదిపట్ల, చెర్లోపల్లె వరకు రహదారి పునర్నిర్మాణ పనులు పూర్తవవడంతో ఆర్టీసీ బస్సులతో పాటు అన్ని రకాల వాహనాలు రయ్యిన దూసుకుపోతున్నాయి. ఈ క్రమంలో రహదారిపై నుంచి గ్రామాల్లోకి వెళ్లే వాహనాలు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరితే ఆ దారి తమ పరిధిలోకి రాదని, నేషనల్ హైవే అథారిటీ పరిధిలోకి వస్తుందని ఆర్‌అండ్‌బీ అధికారులు స్థానికులకు చెప్పారు.నేషనల్ హైవే అథారిటీ అధికారులను కలిసినా స్పందన శూన్యమని గ్రామస్తులు వాపోతున్నారు.

పది రోజుల్లో 7 ప్రమాదాలు

పెరుమాళ్లపల్లె వద్ద పది రోజుల్లో ఏడు ప్రమాదాలు చోటు చేసుకోగా అందులో ఒకరు మృతి చెందారు. పది మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. అంతేకాక మూగజీవాలు సైతం తరచూ రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, పెరుమాళ్లపల్లె పంచాయతీలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను రద్దు చేసి సి.మల్లవరం ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడంతో పిల్లలను వాహనాల రాకపోకలతో రద్దీగా ఉన్న రోడ్డు మార్గంలో అక్కడికి తీసుకువెళ్లడానికి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండల సర్వ సభ్య సమావేశంలో సైతం ఇటీవలే ఈ సమస్యపై సర్పంచ్ జోగి మోహన్ అధికారులను నిలదీశారు. తమ సమస్యకు పరిష్కారం చూపాలని పట్టుబట్టారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ రామచంద్ర, ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి 15 రోజులలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని అదే గ్రామంలో నివాసముంటున్న టీడీపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి సైతం నివేదించినట్టు తెలిసింది.

వర్షాలపై అప్రమత్తం

- కమిషనర్ ఎన్.మౌర్య
- టోల్ ఫ్రీ నంబర్లు 0877 – 2256766, 90008 22909

తిరుపతి తుడా: నగరంలో కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ ఎన్. మౌర్య శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో కోరారు. వర్షాల వల్ల ఏదైనా ఇబ్బంది ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్లు 0877 – 2256766, 9000822909 ను సంప్రదించాలని తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నగర పాలక సంస్థ కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటుచేశామన్నారు. 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని, నగరంలోని ఆయా వార్డుల్లోని అధికారులు, సిబ్బంది స్పందించి సాయం అందిస్తారని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు. కాగా శుక్రవారం సాయంత్రం రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, మేనేజర్ హాసీమ్ టోల్ ఫ్రీ సెంటర్‌ను పరిశీలించారు.

నోటీస్ బోర్డు

- పౌర్ణమి సందర్భంగా తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఉదయం 8.45 గంటల నుంచి మహా చండీహోమం.
- కపిలతీర్థంలోని ఆళ్వార్ తిరుమంజనం వద్ద గోవిందరాజస్వామి, శ్రీకృష్ణస్వామి వారికి ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహణ.
- శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తారకరామ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్.
- అసోసియేషన్ ఆఫ్ పల్మనాలజిస్ట్ ఆఫ్ సీమాంధ్ర(అప్సా) ఆధ్వర్యంలో మంగళం రోడ్డులోని ఆశా కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 9 గంటలకు అప్సా వార్షిక సదస్సు.
- బైరాగిపట్టెడలోని గిరిజన భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రపంచ ఆదివాసి దినోత్సవం.
- గంధమనేని శివయ్య భవన్‌లో ఉదయం 10.30 గంటలకు ధర్నా కరపత్రాల ఆవిష్కరణ.

కూటమి నేతలు నమోస్తుతే..!

- వరలక్ష్మీ వ్రత పూజల్లో రాజకీయ నాయకుల సేవలో తరించిన టీటీడీ అధికారులు
- మండిపడుతున్న భక్తులు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతంలో టీటీడీ అధికారులు కూటమి నాయకుల సేవలో తరించారనే విమర్శలు మూటకట్టుకున్నారు. గురువారం ఆఫ్‌లైన్‌లో టికెట్ల జారీ విషయంలోనూ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో పాటు కూటమి నేతలు, అధికారులు చెప్పిన వారికే టికెట్లను కేటాయించడంపై భక్తుల నుంచి విమర్శలొచ్చాయి. శుక్రవారం ఆస్థాన మండపంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రత పూజల్లో కూటమి నేతలు, కార్యకర్తలే అధికంగా కనిపించడం, పైగా ముందు వరుసలో వారిని కూర్చోబెట్టడం, సుమారు గంటన్నరకు పైగా అనధికారికంగా దర్శనాలను నిలిపివేసి అధికారులు కూటమి నేతల సేవలో తరించడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. భక్తులకు పెద్దపీట వేస్తున్నామని ఓ వైపు టీటీడీ చేస్తున్న ప్రచారానికి, అధికారులు వ్యవహరిస్తున్న తీరుకు పొంతనే లేకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం, భక్తులపై ఇలా వివక్ష చూపడం సరికాదని పలువురు ఆక్షేపించారు.



వరలక్ష్మీ వ్రత పూజల్లో ముందు వరుసలో కూర్చుని ఉన్న కూటమి నాయకులు, కార్యకర్తలు

మతం కన్నా మానవత్వం మిన్న

–గంథోత్సవంలో ప్రభుత్వ ఖాజీ

తిరుపతి కల్చరల్: ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న హజ్రత్ పీర్ సయ్యద్ షా అమానుల్లా ఖాద్రీ ఆవరణలోని హజరత్ దర్గాలో హజరత్ పీర్ సయ్యద్ యాఖూబ్ హుజన్ అలి ఆరీఫుల్లాషా ఖాదరి 60వ గంథోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దర్గా ముతవల్లి, ప్రభుత్వ ఖాజీ, హజరత్ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదిరి ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ, కులమతాలకతీతంగా గంథోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గురువులు, పీఠాధిపతుల ఆధ్యాత్మిక బోధనలతో జీవితాన్ని సార్థకం చేసుకోవాలని ఆకాంక్షించారు. మతం కన్నా మానవత్వం మిన్న అని గంథోత్సవంతో చాటుతున్నట్టు చెప్పారు. అనంతరం ముస్లింల ఆధ్యాత్మిక, భక్తి విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులందరికీ శాఖాహారం పంపిణీ చేశారు. పలువురు ముతవల్లీలు, పెద్దలు, దర్గా శిష్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి, ముతవల్లీలు, ముస్లిం పెద్దలు

హైకోర్టు ఆదేశాలతో ఇనుప కంచె తొలగింపు

భాకరాపేట: ఎర్రావారిపాళెం మండలం కమలయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ, బండ్లగానేపల్లె గ్రామ పంచాయతీ రహదారిపై అనధికారికంగా వేసిన ఇనుప కంచెను హైకోర్టు ఆదేశాలతో తొలగించారు. వివరాలు.. పంచాయతీ రోడ్డును కొంతమంది ఇనుప కంచె వేసి మూసివేయడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. పలు పర్యాయాలు పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. తిరుపతి ఎస్పీ, ఎర్రావారిపాలెం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, రోడ్డును అడ్డుకున్న వారిని ప్రతివాదులుగా చేర్చారు. వాదనలు విన్న హైకోర్టు స్పందించింది. హైకోర్టు ఆదేశాలతో ఎర్రావారిపాళెం పోలీసులు ఆ ఇనుప కంచెను తొలగించారు. రాకపోకలకు అవరోధాలు లేకుండా చర్యలు తీసుకున్నారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించడంలో సహకరించిన వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్, చిత్తూరు జిల్లా లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ పసపల సుధాకర్ రెడ్డి, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇనాచార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి, హైకోర్టు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో థ్యాంక్యూ వైఎస్సార్‌సీపీ అంటూ ప్లకార్డులు చూపుతున్న బాధితులు

డి-ఫార్మసీ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డీ-ఫార్మసీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు టీటీడీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థినులు కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు ఈనెల 9 నుంచి అందుబాటులో ఉంటాయని, ఈనెల 19వ తేదీలోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు. కళాశాలలో ప్రవేశాలు పొందిన విద్యార్థినులకు ఉచిత హాస్టల్, భోజన సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు. వివరాలకు 9299008151, 9247575386, 8978993810 నంబర్లను సంప్రదించాలన్నారు.

రాజీవ్‌గాంధీ కాలనీలో కంపు..కంపు..!

– రాజీవ్‌గాంధీ కాలనీలో వ్యర్థాలతో నిండిన మురుగు కాలువలు

తిరుపతి మంగళం : తిరుపతి నగర శివారు ప్రాంతమైన జీవకోన, రాజీవ్‌గాంధీ కాలనీలలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. రాజీవ్‌గాంధీ కాలనీ మార్గంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద రోడ్డుకు, మురుగు కాలువకు రెండడుగుల ఎత్తు ఉండడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారని, దీనికి తోడు మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం చిమ్ముతోందని, దీనిపై స్పందనలో కార్పొరేషన్ కమిషనర్‌కు ఎన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని తిరుపతి 49వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు జీవకోన రెడ్డెప్ప ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు.



రాజీవ్ గాంధీ కాలనీ మార్గంలో మురుగు కాల్వను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టీటీడీ అనుబంధ ఆలయాల్లో 'సౌభాగ్యం'

తిరుపతి అన్నమయ్యసర్కిల్: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం 52 టీటీడీ అనుబంధ ఆలయాలలో సౌభాగ్యం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు టీటీడీ ప్రజా సంబంధాల అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలోని తిరుచానూరు, నారాయణవనం, శ్రీకాకుళం, కార్వేటినగరం, దేవుని కడప, ఒంటిమిట్ట, హైదరాబాద్, సీతంపేట, పిఠాపురం, కీలపట్ల, అనంతవరం, రాజాం, సరిమల్లె, అమరావతి, విజయవాడ తదితర ఆలయాల్లో సౌభాగ్యం కార్యక్రమం కింద సౌభాగ్యవతులకు గాజులు, కుంకుమ, పసుపు దారాలు, కంకణాలను స్థానిక అధికారులు, శ్రీవారి సేవకులు పంపిణీ చేసినట్లు తెలియజేశారు. దాతల సహకారంతో 8 లక్షల గాజులు, 1.60 లక్షల కంకణాలు, 1.60 లక్షల పసుపు దారాలు, 1.60 లక్షల అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, అమ్మవారి లక్ష్మీ అష్టోత్తర శత నామావళి పుస్తక ప్రసాదాలను కానుకగా ఇవ్వడం విదితమే.

నేడు ప్రపంచ ఆదివాసి దినోత్సవం

తిరుపతి అర్బన్: స్థానిక బైరాగిపట్టెడలోని గిరిజన భవనంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్టు జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి రాజా సోము శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, గిరిజన సంఘాల అధినేతలు హాజరవుతారని, గిరిజన విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ఈ ఏడాదిలో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానం చేస్తామని తెలియజేశారు.

'నవోదయ' ప్రవేశ పరీక్షకు 23 తుది గడువు

తిరుపతి సిటీ: జవహర్ నవోదయ విద్యాలయలో 2026 –2027 విద్యా సంవత్సరానికి సంబంధించి 9వ, 11వ తరగతి ప్రవేశాలకు గడువు ఈనెల 23వ తేదీ ముగియనున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2025–2026 విద్యా సంవత్సరంలో ఏదేని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతిలోనూ, 10వ తరగతి విద్యార్థులు 11వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లలో కానీ వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్ష సమాచార కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

ఆయనపై సమగ్ర విచారణ చేయాలి

చంద్రగిరి: ఎస్వీ వెటర్నరీ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కిరణ్ బాబుపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపాక దాము డిమాండ్ చేస్తూ వెటర్నరీ యూనివర్సిటీ వీసీ రమణకు లేఖ రాశారు. ఆయన మాట్లాడుతూ, కిరణ్ బాబు కారుణ్య నియామకం కింద ఉద్యోగంలో చేరారని, ఆయన తండ్రి మునిరత్నంకు సంబంధించి తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయన్నారు. దీనిపై వార్తాపత్రికలు, దళిత సంఘాలు కోడై కూసినా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని, తక్షణం వీసీ స్పందించి పూర్తిస్థాయి విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

వరలక్ష్మీ నమోస్తుతే..!



గాజుల ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న గంగమ్మ

- ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దర్శనం



తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో వరలక్ష్మీవ్రత పూజలు చేస్తున్న భక్తులు

తిరుపతి కల్చరల్: శ్రావణమాసంలో మహిళలు అమ్మవారి ఆలయాల వద్ద వరలక్ష్మీ వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయం, కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, కొర్లగుంటలోని కొల్హాపురి మహాలక్ష్మి ఆలయం, పాత తిరుచానూరు రోడ్డులోని అంకాలమ్మ ఆలయం, లక్ష్మీపురం సర్కిల్‌లోని అన్నపూర్ణ ఆలయంలో ఈ వ్రతపూజలు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా చేశారు. వ్రత పూజల అనంతరం భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, రవిక, పూలు ప్రసాదాలుగా అందజేశారు. ఇక, తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఉదయం 7 గంటలకు గంగమ్మకు అభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం వివిధ రకాల గాజులతో సర్వాంగ సుందరంగా అలంకరించి కొలువు తీర్చారు. ఆలయ మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి అర్చకులు భక్తులతో వరలక్ష్మీ వ్రతపూజలు చేయించారు. భక్తులకు ఆలయ ఈఓ ఏ.జయకుమార్ ఆధ్వర్యంలో ప్రసాదాల వితరణ చేశారు. అలాగే నగర ప్రజలు తమ నివాసాలలోనే వ్రత పూజలు చేశారు. ముత్తైదువులకు వాయనాలు ఇచ్చారు.

శక్తి చాముండేశ్వరి ఆలయంలో..

తిరుపతి రూరల్: మండలంలో తుమ్మలగుంట సమీపంలోని శ్రీ శక్తి చాముండేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 5.30 గంటలకు అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకం, అలంకరణ, హోమం నిర్వహించారు. ఆ తర్వాత రాహుకాల అభిషేకం నిర్వహించారు.భక్తులకు ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం 6.30 నుంచి అమ్మవారికి 9 రకాల దీపాలతో హారతులు ఇచ్చి పౌర్ణమిదీపం వెలిగించారు. చుట్టుప్రక్కల గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.



వరలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శక్తి చాముండేశ్వరి